# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 29-04-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌ను లాజిస్టిక్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రైలు కనెక్టివిటీని విస్తరించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

2. **తెలంగాణలో పదవ తరగతి పరీక్షా ఫలితాలు ఈ రోజు విడుదల కానున్నాయి.**

3. **రాబోయే రెండేళ్లలో ఉత్తరాంధ్రలో 11 నీటి ప్రాజెక్టులను పూర్తి చేయడమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు.**

4. **రైతుల సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థ సారథి తెలిపారు.**

=========================

ఆంధ్రప్రదేశ్ నుంచి వ్యవసాయ, ఆక్వా ఉత్పత్తుల రవాణాకు ప్రత్యేక కంటైనర్ రీఫర్ రైళ్లు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర రైల్వే శాఖను కోరారు. విశాఖపట్నంలో కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కలిసి దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం కేంద్రమంత్రితో కలిసి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రాన్ని లాజిస్టిక్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రైలు కనెక్టివిటీని విస్తరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అలాగే రాష్ట్రంలోని పోర్టులకు మెరుగైన రైల్వే అనుసంధానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, పోర్టుల కనెక్టివిటీకి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.

-------------------------

ఆదర్శ నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దుతామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట సమీపంలో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ కార్యాలయ నిర్మాణానికి ముఖ్యమంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. అనంతరం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ,

వాయిస్ ..30.. సెకన్లు

-------------------------

తెలంగాణలో పదవ తరగతి పరీక్షా ఫలితాలు ఈరోజు విడుదల కానున్నాయి. మధ్యాహ్నం 2 గంటలకు

ఫలితాలు వెల్లడించనున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం వెల్లడించింది. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపింది. విద్యార్థులు తమ ఫలితాలను results.bse.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు. ఈసారి పరీక్షా ఫలితాలను వాట్సాప్ ద్వారా ఫలితాలను తెలుసుకునే అవకాశాన్ని విద్యా శాఖ కల్పించింది. విద్యార్థులు 80969 58096 అనే నంబర్‌కు 'హాయ్' అనే సంక్షిప్త సందేశం పంపి, అనంతరం "SSC Results" ఎంపిక చేసి, తమ హాల్‌టికెట్ నంబర్ నమోదు చేసి ఫలితాలను తెలుసుకోవచ్చని తెలిపింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో గూగుల్ డేటా సెంటర్ ప్రారంభం ఒక చారిత్రాత్మక ఘట్టమని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. అనంతపురంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన నిన్న మాట్లాడుతూ, గూగుల్ డేటా సెంటర్ ప్రాజెక్ట్ భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. క్వాంటం సాంకేతికత, డేటా సెంటర్ల అభివృద్ధితో వచ్చే ఇరవై సంవత్సరాల్లో ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ అవకాశాల కేంద్రంగా మారుతుందని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..25.. సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో పెట్రోల్, డీజిల్‌ను అక్రమంగా దారి మళ్లించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇంధన సరఫరాపై సంబంధింత అధికారులతో శ్రవణ మాధ్యమం విధానంలో అమరావతి నుంచి ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పెట్రోల్ బంకుల్లో రేషన్ పద్ధతిని కొనసాగించాలని సూచించారు. రాష్ట్రంలో బంకుల మూసివేతలు తగ్గాయని, చమురు సంస్థల నుంచి సరఫరా కూడా పెరిగిందని తెలిపారు.

---------------------------

రాబోయే రెండేళ్లలో ఉత్తరాంధ్ర అభివృద్ధికి 2 వేల కోట్ల రూపాయలతో 11 నీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. ఉత్తరాంధ్ర నీటి ప్రాజెక్టుల పురోగతిపై విజయవాడ క్యాంపు కార్యాలయంలో సంబంధిత అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు పూర్తయితే 2 లక్షల 69 వేల ఎకరాలకు కొత్తగా నీటి సౌకర్యం లభించడంతో పాటు, 2 లక్షల 49 వేల ఎకరాల సాగు స్థిరీకరణ సాధ్యమవుతుందని చెప్పారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు సాగులోకి తీసుకురావడం, అలాగే కరువు ప్రభావిత ప్రాంతాలకు నీటి అందుబాటు కల్పించడం పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని మంత్రి వివరించారు.

---------------------------

రైతుల సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థ సారథి తెలిపారు. కృష్ణా జిల్లా పామర్రు మండలం కారకంపాడు గ్రామంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి నిన్న మాట్లాడుతూ, ధాన్యం చెల్లింపులు 24 నుంచి 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని వెల్లడించారు. ధరల స్థిరీకరణ నిధి కింద 800 కోట్ల రూపాయలను మంజూరు చేసి రైతులకు మద్దతు అందిస్తున్నామని మంత్రి తెలుపుతూ...

వాయిస్ ..25.. సెకన్లు

---------------------------

ఆక్వా రంగానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2 లక్షల 34 వేల హెక్టార్లలో ఆక్వాకల్చర్ సాగు జరుగుతుండగా, అందులో చేపల పెంపకం, ఉప్పునీటి సాగు కొనసాగుతున్నాయని మంత్రి నిన్న ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆక్వా పంటల సాగుకు నిరంతర విద్యుత్ అవసరమని, విద్యుత్ అంతరాయం ఉన్నప్పుడు రైతులు డీజిల్ జనరేటర్లపై ఆధారపడుతున్నారని చెప్పారు. జిల్లాల వారీగా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని మంత్రి తెలిపారు.

---------------------------

తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి  కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి నిన్న బహిరంగ లేఖ రాశారు. చర్లపల్లి రైల్వే స్టేషన్ దగ్గర రహదారులు, పార్కింగ్ కోసం భూమి, సికింద్రాబాద్ స్టేషన్ రోడ్డు విస్తరణ గురించి లేఖలో ప్రస్తావించారు. చర్లపల్లి రైల్వే స్టేషన్ పరిసరాల్లో రహదారులు ఇరుకుగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని  లేఖలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆ రహదారులను విస్తరించాలని  కోరారు. అదేవిధంగా, స్టేషన్ వద్ద పార్కింగ్ సౌకర్యాల కోసం అదనంగా ఐదు ఎకరాల భూమిని కేటాయించాలన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో  ఎండల  తీవ్రత కొనసాగుతోంది.  ప్రకాశం జిల్లా కంభం, వైఎస్సార్ కడప జిల్లా ఒంటిమిట్టలో నిన్న గరిష్ఠంగా 44.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈరోజు  విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని 21 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, మరో 7 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని తెలిపింది.

---------------------------

అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు. నృత్య కళ గురించి ప్రజలలో అవగాహన పెంపొందించడం, నృత్య విద్యను ప్రోత్సహించడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. అంతర్జాతీయ నృత్య సంఘం పిలుపుమేరకు 1982 నుండి ప్రతి ఏటా ఏప్రిల్ 29న ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రపంచ దేశాల సంస్కృతిలో నృత్యానికి ఉన్న ప్రాధాన్యతను తెలియజేయడమే ఈ అంతర్జాతీయ నృత్య దినోత్సవం నిర్వహణ ముఖ్యోద్దేశం .

=====================